ఓంశ్రీసాయిరాం

పరమ పావనమైన భారతావనియందు
సహనమన్నదె మనకు చక్కదనము
వ్రతములన్నింటను వన్నెగాంచినయట్టి
ఘనసత్యశీలమే కఠిన తపము
మధుర భావంబేది మన దేశమందన్న
మాతృభావము కంటె మాన్యమెద్ది
ప్రాణంబు కంటెను మానంబె ఘనమను
మన దేశ నీతిని మంటగలిపి
నేటికిచ్చిరి పరదేశ నీతులరసి
వెస విచిత్ర స్వేచ్ఛయను విచ్చుకత్తి
ఔర! ఏమందు భరత పాలనంబు
ఏనుగెట్టుల తన బలమెరుగలేదొ
అట్టులైనారు భారతీయులు నేడు.

జాతి గౌరవంబు నీతిపై నిలుచును
నీతిలేకయున్న జాతి చెడును
నీతి కల్గు జాతి నిజమైన జాతిరా
వినుము భారతీయ వీరసుతుడ!

విద్యార్థులారా!

ఈనాటి మానవత్వములో మేధాశక్తి మితిమీరిపోవుచున్నది. తెలివితేటలు హద్దులేని రీతిగా పెరిగిపోతున్నాయి. కానీ, గుణము మాత్రము కించిత్తైనా కలగటం లేదు. ఈనాటి మానవుడు సాంకేతిక విజ్ఞానశాస్త్రము విరివిగా పెంచుకొని మానవుడు కేవలము పక్షివలె ఆకాశములో సంచరించటం నేర్చుకున్నాడు. మత్స్యమువలె జలములో సంచరించటం నేర్చుకున్నాడు. పక్షివలె ఆకాశములో సంచరించటము, మత్స్యమువలె జలములో సంచరించటము, జీవించటము అతికుశలమైన బుద్ధితో నేర్చుకున్నాడు. కానీ, మానవుడు మానవునిగా భూమిపై జీవించటం నేర్చుకోటం లేదు. మానవుడు భూమిపై జీవించటం నేర్చుకోవాలిగానీ ఆకాశములో జీవించటం నేర్చుకోటం వలన వచ్చిన ఫలితమేమీ లేదు. మానవునికి భూమియే ఆధారము. ఆధారమైన భూముని వదలి ఆకాశమునందు సంచరించటం నేర్చుకున్నంత మాత్రమున మానవుని తెలివితేటలు పెరిగినవని భావించరాదు. ఇది కేవలము భ్రాంతి మాత్రమే. తాళము తప్పిన పాట, ఆట, ఇచ్చిన మాట తప్పుట యేమాత్రమూ పనికిరాదు. ఈనాటి తెలివితేటలతో ఏకత్వమును అనేకత్వముగా విభజించే మేధావులు అభివృద్ధి అవుతున్నారు. కానీ, అనేకతేవములోని ఏకత్వము గుర్తించే తెలివితేటలు, గుణములు మరచిపోతున్నారు. కనుక, అనేకత్వములోని ఏకత్వము గుర్తించటమే మానవుని ప్రధాన కర్తవ్యముగానీ ఏకత్వమును అనేకత్వముగా విభజించటము మానవుని అల్పబుద్ధి లక్షణము. ఒక్కటీగానున్న వస్త్రమును అనేక ముక్కలుగా చేయుట సులభము. అనేక ముక్కలుగా వున్నదానిని ఏకంగా చేసుకోటం కష్టము. ఆ ఏకత్వములోనే జీవితములో ఆనందముగానీ, అనుకూలముగానీ చేరుతున్నాది. ఈ మానవత్వములో భిన్నత్వము, ఏకత్వము రెండింటి సమత్వము మనము గుర్తించాలి. విద్యార్థులున్నారు. ఒక షర్టు కుట్టించుకోవాలనుకుంటే రెండు మీటర్ల బట్ట తీసుకుంటారు. టైలరు దగ్గరకు వెడతారు. టైలరు షర్టు కుట్టి యివ్వాలి. అప్పుడు టైలరు రెండు మీటర్ల బట్టను ముక్కలు ముక్కలుచేస్తాడు. ఈ ముక్కలు చేయక షర్టు తయారు కాదు. చేతులు వేరుగా, పోకెట్ వేరుగా, కాలరు వేరుగా వుండాలి. అన్నింటియందు బట్ట ఒక్కటిగానే వుంటుంది. అనేక ముక్కలు చేసింది ఏది? కత్తెర. షర్టు కుట్టటానికి అనేక ముక్కలు ఏకంగా చేస్తారు. ఆ ఏకంగా చేసేది ఏమిటి? అన్నింటిని ఏకత్వం చేసేది సూది. ఏకత్వమును భిన్నంగా చేసేది కత్తెర, అన్నింటిని ఏకత్వము చేసేది సూది. ఈనాటి మానవుడు కత్తెరగా తయారౌతున్నాడుగనీ, ఏకంగా చేసే సూదిగా తయారుకావటం లేదు. ఇది పెద్ద తెలివితేటలనుకుంటున్నారు. ఇది కాదు మన తెలివితేటలు. ఈనాడు తెలివితేయలను విస్మరించి యుక్తిప్రయుక్తులతో జీవితమును నిరర్థకము

గావించుకుంటున్నాడు. ఒక కుటుంబము వుంటున్నాది. తల్లి, తండ్రి, కుమారుడు. తండ్రి కష్టపడి సంపాయించి ధనమును తీసుకు వచ్చినప్పుడు తల్లి చాలా ఆనందపడేది. ఏనాడు పని చిక్కక వట్టి చేతులతో యిల్లుచేరెనా, తండ్రిని చూచి తల్లి చాలాకోపముపడేది. ప్రతిదినము సుఖదుఃఖములతో వుండిన సంసారము చూస్తూ వచ్చాడు ఈ పిల్లవాడు. జీవితము సుఖదుఃఖముల సమ్మిళితము. లాభనష్టములు, సుఖదుఃఖములు, మంచిచెడ్డలు, చీకటివెలుగులు యివన్నీ ఒకదానికొకటి ప్రతిబింబములు. ఈ బాధలు భరించుకొనలేక తండ్రి ఒకనాడు కాళికాదేవాలయమునకు వెళ్ళాడు. 'తల్లీ! దేవీ! నేనీ బాధలు భరించుకోలేను. ఈ భార్యతో నేను జీవించలేను. ఆమెకు త్వరగా మరణము సంభవించేటట్టు చేయి' అని ప్రార్థించాడు. 'తథాస్తు' అన్నది దేవి. మరణించింది. ఈ దృశ్యము చూచాడు కుమారుడు. కుమారుడు తిరిగి కాళికాదేవాలయమునకు వెళ్ళాడు. దీర్ఘమైన మనస్సుతో ప్రార్థించాడు కాళికాదేవిని. కాళికాదేవి ప్రత్యక్షమైంది. 'నాయనా! ఏమి కావాలి?' అని ప్రశ్నించింది. 'నా తల్లిని బ్రతికించు' అన్నాడు. 'తథాస్తు' అన్నది. తండ్రి చావును కోరాడు, కుమారుడు జీవితము కోరాడు. వీరి ప్రార్థన ఏమిటి? మరణము, జీవనము. ఈ రెండింటి మధ్యలోనే జీవితము అంత్యమైపోతుంది. ఇదా తెలివితేటలు! తల్లికి మంచి గుణములు య్యిమంటే ఎంత హాయిగా వుంటుంది! నా భార్యకు మంచిగుణములు ప్రసాదించమని కోరవచ్చు కదా! కట్టకడపటికి ప్రార్థనలు చేస్తే ఏమి జరిగింది? జననమరణాలకు మూలకారణమైంది. దీనికి ప్రార్థన ఎందుకు?

పునరపి జననం పునరపి మరణం పునరపి జననీ జఠరే శయనం
ఇహ సంసారే బహుదుస్తారే కృపయాపారే పాహి మురారే.
భజగోవిందం భజగోవిందం గోవిందం భజ మూఢమతే.

జననము, మరణము ఈ రెండింటి మధ్యలోనే మన జీవితము అంత్యము గావించుకొనుటయా! మన జీవిత లక్ష్యము ఏమిటి? ఈ జీవితముయొక్క గమ్యము ఏమిటి? ఈ మానవత్వము చాలా పవిత్రమైనదిగా భావిస్తున్నారు. జన్తూనాం నరజన్మ దుర్లభం. ఏమిటి ఈ దుర్లభం? ఇది కాదు మనం కోరవలసినది. మన జీవితము ఆదర్శవంతమైన జీవితముగా నిరూపించాలి. మన వైస్‌ఛాన్సలర్ చెప్పాడు, పిల్లలు, మరణించిన తల్లిదండ్రులకు శ్రాద్ధము విడుస్తూ వుంటారు. శ్రద్ధతో సంవత్సరమునకొక పర్యాయము కృతజ్ఞత చూపే రీతిగా కంటిధారలతో కృతజ్ఞత చూపుతారని. దీనిని తద్దినం అంటారు. మరణించిన దినమును ఆనాడు స్మరించి వారు ఈ జన్మను ప్రసాదించినందుకు కృతజ్ఞత తెలుపుతూ రెండు కంటిధారలు వదలటం, అదే నిజమైన తర్పణం. మొట్టమొదట తల్లిదండ్రులకు కృతజ్ఞత అందించాలి. దేనికోసం? నీ బ్లడ్డు, నీ ఫుడ్డు, నీ దుడ్డు నీ పేరెంట్సు గిఫ్ట్. మొట్టమొదట వారికి కృతజ్ఞత అందించాలి. వారు మరణించిన దినమున స్మరించి, వారియొక్క ప్రేమ తత్త్వాన్ని, వారు మన అభివృద్ధిగావించిన జీవితమును మనం స్మరించి కంటిధారల తర్పణము విడవాలి. ఇది ప్రతి పుత్రుని ప్రధాన కర్తవ్యము. నీవు ఈనాడు ఈ పవిత్ర కర్మలాచరించినప్పుడు భవిష్యత్తులో నీకు same reaction, resound, reflection. ఈనాడు నీవు తండ్రిని ప్రేమించినప్పుడే రేపటి దినము నీ బిడ్డలు నిన్ను ప్రేమిస్తారు. ఈనాడు తల్లిదండ్రులను నీవు మోసము చేసినప్పుడు నిన్ను నీ బిడ్డలు మోసం చేస్తారు. ఈ ప్రాకృత జగత్తునందు, ఈ భౌతికమైన జగత్తునందు, ఈ అనిత్యమైన జగత్తునందు reaction, resound, reflection వుంటున్నాది. ఇది తప్పించటానికి ఎవరి తరమూ కాదు. మనము ఈ కృతజ్ఞతను హృదయమునందు భద్రము గావించుకొని దీనికి తగిన ఆదర్శమునందించాలి. తెలివితేటలు పెంచుకుంటున్నారుగానీ ఈనాటి విద్యార్థులు గుణము ఎక్కడా కనిపించటం లేదు. 'చదువులందు హీరో, గుణములందు జీరో'. చదువు లోపల నూటికి నూరు మార్కులు తెచ్చుకుంటున్నారు. గుణములో నూటికి నూరు మార్కులు రావటం లేదు. education without character is useless. కనుక, మనము గుణములు మొట్టమొదట సంపాయించుకోవాలి. నీవు గొప్ప ధనవంతుడు కావచ్చు. గొప్ప మేధావి కావచ్చు. గొప్ప అధికారి కావచ్చు. గొప్ప బలవంతుడు కావచ్చు. జనబలము, బుద్ధిబలము, ధనబలము, సర్వబలములూ కూడా సంపాయించవచ్చు. కానీ, దైవబలము లేకపోతే! మీకందరికీ తెలుసు మహాభారతమందు.

భుజబలంబు గొప్ప బుద్ధిబలంబుండి
దైవబలము లేక దీనుడగును
కర్ణుడంతటివాడు కడపటికేమయ్యె
వినుడు భారతీయ వీరసుతుడ!

పూర్వము మహమ్మదీయ చక్రవర్తి వుండేవాడు. అతను మహాభారత పవిత్రతను శ్రవణము చేశాడు. మహాభారతములో

పంచపాండవులు మహాగుణవంతులు, ఆదర్శపురుషులనే సత్యాన్ని గుర్తించాడు. ఆయొక్క గుణములు తనకు తగినట్టు చేసుకోవాలనే వుద్దేశ్యముతో అష్టదిగ్గజములను పిలిపించాడు. అందరూ వెళ్లారు. నన్నయ, తిక్కన, ఎఱ్ఱాప్రగడ, మల్లన్న, సూరన్న, రామరాజభూషణుడు, తెనాలి రామకృష్ణ. వీరందరిని పిలచి గొప్ప సభ జరిపాడు. ఏమి చెప్పాడు? 'ఓ మహాపండితులారా! మీకు గొప్పబహుమతిని అందిస్తాను. ఈ మహాభారత చరిత్ర నాకు అన్వయించేరీతిగా వ్రాయండి. మహాభారతములో సత్యవంతుడు, ధర్మస్వరూపుడు ధర్మజుడు. నన్ను ధర్మరాజుగా ఎన్నుకోండి' అన్నాడు. నన్నయ, ' తానీషా! మిమ్మల్ని ధర్మరాజుగా పోల్చుకుంటాము. కానీ, నీకు నల్గురు సోదరులు వుండాలి. ఎవరిని ఎన్నుకోమంటారు?' అడిగాడు. యోచన చేశాడు. 'నా మంత్రులలో నాకు చాలా యిష్టమైనవారున్నారు. ఆ నలుగురూ నా సోదరుల మాదిరి' అన్నాడు. 'తానీషా! కౌరవులున్నారు. ఎవరిని పెట్టమంటారు?' అడిగాడు. 'నా విరోధులందరూ కౌరవులే. వారు వందలమంది వుంటున్నారు. కాబట్టి, నాపై ద్వేషముగా వున్నవారిని కౌరవులుగా మీరు నిర్ణయించుకోండి'. అందరూ చక్కగా వుండినారు. తెనాలి రామకృష్ణ లేచాడు, 'తానీషాగారూ! పాండవులంతా సరిపోయారు. మంత్రులను తీసుకుంటాం. భుజబవముండినవాడు భీముడౌతాడు. బుద్ధిబలమున్నవాడు అర్జునుడౌతాడు. ఇంక తెలివిగలవారు నకులసహదేవులౌతారు. మీరు ధర్మజుడైనప్పుడు భార్య ద్రౌపది కావాలి. ఆమె పాంచాలి. దీనికి మీరు ఎవరిని నిర్ణయిస్తారు?' అడిగాడు. 'నాకు భారతమే వద్దు' అన్నాడు. అనగా మహాభారతములోని కీలకము మనం గుర్తించిన తరువాత ఈ కథలకు మనం ప్రవేశించాలి. ప్రతివిషయందు ఒక్కొక్క వ్యక్తికి. ఒక్కొక్క పదార్థమునకు, విషయమునకు ఒక లైఫ్‌ఫోర్సు వుంటుంది. ఆ లైఫ్‌ఫోర్సును మనం గుర్తించినప్పుడే మనం సులభంగా అర్థము చేసుకోవచ్చు. ఈ లైఫ్‌ఫోర్సు తెలియని వారికి యిదే గతి అవుతుంది. ఈనాటి తెలివితేటలన్నీ యీవిధమైన పెడమార్గము పట్టిపోతున్నాయి. కావలసినంత తెలివితేటలుంటున్నాయి. ఏమి ప్రయోజనము? గుణము కొంచెముండినా ఎంతైనా సాధించవచ్చు.

యం.యేలు, బియ్యేలు పా&.సయి వచ్చియు
పేరుగాంచిన పెద్దవారలైన
సంపదలుండియు సద్దానపరులయి
పుడమి కీర్తి గనిన పుణ్యులైన
ఆయురారోగ్యంబు మనవరతమునుండి
పరిపూర్ణబలులగు వారలైన
సతతంబు తపములు జపములు సేయుచూ
వేదంబులను నేర్పు విప్రులైన
సాటిరారు భక్తులకు నేనాటికైన
నీదు భక్తులు కానిదే రాదు ముక్తి
ఇంతకన్నను వెరెద్ది ఎరుకపరతు
సాధుసద్గుణగణ్యులౌ సభ్యులార!

విద్యార్థులారా! ఇంత పవిత్రమైన భారతదేశమందు ఉద్భవించి తెలివితేటలతోబాటు గుణమునుకూడా పెంచుకోటానికి ప్రయత్నించాలి. తెలివితేటలు కొన్ని పనులు పూర్తిచేయిస్తుందిగానీ గుణము అట్లాకాదు. కీర్తిని సంపాయిస్తుంది. మనము సంపాయించవలసినవి ఈ రెండే. ఈ జీవితములో సత్యనిత్యమైనవి ఈ రెండే. ధర్మంకీర్తి ద్వయం.

అనిత్యం జీవనం లోకే. ఇదంతా అనిత్యమైనది. అన్నీ కదలిపోయే మేఘముల వంటివి. పుట్టిన తక్షణమే child అన్నారు. 30 సంవత్సరములకు man అన్నారు. 75 సంవత్సరములకు grand father అన్నారు. child, man, grand father, ఒక్కడే. ఉన్నది ఒక్క వ్యక్తే. వయస్సును బట్టి ఈవిధమైన వ్యత్యాసములు బయలుదేరుతూ వచ్చాయి. ఈనాడు లోకమునకు భగవంతుడు అందించిన విలువైన శక్తి ఒక్కటే, అదే కాలము. time is very important. Do'nt waste time. time waste is life waste. time is God. కాలాయనమః, కాలకాలాయనమః, కాలదర్పదమనాయనమః, కాలాతీతాయనమః, కాలనిర్మితాయనమః. జననమరణాలకు కాలమే ప్రధానము. ఎవరైనా పోతే కాలము తీరిపోయింది అంటారు. చెట్టుపై పుట్టిన కాయ కాలము వలనే పరిపక్వమైపోతుంది. కాలము చాలా ప్రధనమైనది, ప్రమాణమైనది.

విద్యార్థులారా! ఈ పవిత్రమైన కాలమును మూడువంతులు వ్యర్థము చేస్తున్నారు. ఉన్న భాగము తిండితీర్థాదులతో గడిచిపోతున్నాది. మిగిలిన ముక్కాలు భాగము ఏమి చేస్తున్నారు? వీరిని గురించి, వారిని గురించి అనవసరమైన

విషయములలో కాలము వ్యర్థము చేస్తున్నారు. ఇంక పరులను దూషించటము, పరిహసించటము, యిలాంటి కార్యాలలో వ్యర్థము  చేస్తున్నారు.

పరుల తిట్టినంత పాప ఫలంబబ్బు
విడువదెన్నటికిని  విశ్వమందు
పరులు పరులు కాదు పరమాత్ముడగునయా

పరులు పరులు కాదు, వారుకూడా పరమాత్ములే. నీవు పరమాత్ముని దూషించిన వాడౌతావు. ఎవరినీ మనం విమర్శించ కూడదు. దీనితోనే కాలమును అమితంగా నష్టం చేస్తున్నాము. ఒకరినొకరు విమర్శించుకోటం, ఒకరినొకరు దూషించుకోటం, ఇంతకంటే యింక దమ్మిడీ పనిలేదా మీకు? ఏ పనీ లేకపోతే పరుపు వేసుకొని నిద్రపో. ఎందుకీ మాటలతో కాలము వ్యర్థము చేస్తున్నారు? కాలము అపవిత్రము చేసేవాడు మహాపాపి. నిజముగా మన భారతదేశములో కష్టించి పనిచేసినప్పుడు, భారతదేశము అన్నపూర్ణ స్వరూపమైనది. మన భారతదేశములో భూమికి తక్కువ లేదు. భారతదేశములో జీవనదులకు తక్కువ లేదు. ఎంతైనా పంటను పండించవచ్చు. భారతదేశములోని అనుకూలములు మరి ఏదేశమందూ లేవు.కష్టించి పనిచేసేదానికి భారతదేశము గొప్ప ప్రదేశము. కానీ, ఈనాడు కష్టించి పనిచేసే వ్యక్తులు లేకపోవటం చేతనే అన్నముకోసము పరులను దేహి అని అడగవలసి వచ్చింది. ఎన్నో దేశములనుండి అప్పు తీసుకొని వస్తున్నాది. ఎందుకీ అప్పులు? మన దగ్గర కుప్పలుగా వుంటున్నవి. దానిని సద్వినియోగం చేసుకోండి. దానిని పవిత్రము గావించుకోండి. కష్టపడి పనిచేయండి. రెక్కలాడితే డొక్కలాడతాయి. మన రెండు చేతులతో పని చేస్తే ఒక్క పొట్ట నింపుకోలేమా! ఈనాడు రెండుచేతులున్నా ఒక్క పొట్ట నింపుకోలేకపోతున్నాము బలహీనులైపోయి. కష్టపడి పని చేయి. do your work sincerely. అప్పుడే మన జీవితము ఆరోగ్యముగా వుంటుంది. ఆరోగ్యమే కాదు ఆనందముగా వుంటుంది. ఈనాడు పనికి పరార్, తిండికి తయార్. ఇంత తర్కించటము. తర్కము చేసేవానికి పూర్తి మట్టే వుండేది తలలో. 'పుస్తకములనిండ మస్తుగా చదువుండె, మస్తకములిండ మట్టిమెండు'. ఏమి ప్రయోజనము. పుస్తకాలలో వుంటున్నాది గొప్ప ప్రవీణత. పుస్తకమును మస్తకముగా మార్చుకో కానీ మస్తకమును పుస్తకముగా మార్చవద్దు. తెలియనివాడే తర్కములో ప్రవేశిస్తాడు. తర్కానికే మనం పోకూడదు. ఏమి తెలిసినదని నీవు ఆర్గ్యుమెంటు చేస్తావు? చంద్రమండలము తరువాత ఏమున్నదని యోచన చేస్తావు. నీవు చూడలేదు. ఏవిధముగా ఆర్గ్యుమెంటు చేయగలవు? ఏది వుందని నీవు నిర్ణయించగలవు? నీ కాలి క్రింద భూమి వున్నదని చెప్పవచ్చు. ఇది నీకు తెలుసు. తెలియని దానిపై ఆర్గ్యుమెంటు చేస్తే యేమిటి ఫలితము! కాలము వ్యర్థము. జ్ఞాపకశక్తి కూడా పోతుంది. త్వరలోనే వృద్ధాప్యము ప్రారంభమౌతుంది.

విద్యార్థులారా! నాకు చెప్పటము, తలచటము, చేయటము ఒక్కటే, మీరు నమ్మినా నమ్మకపోయినా. కనుక, ఏవిధమైన బలహీనత ఎప్పుడూ, ఏనాడూ, ఎక్కడా రాలేదు. పిల్లలు చూడండి. 18 సంవత్సరములు, 19 సంవత్సరములు. ఎట్లా వున్నారు? క్యాస్టలిరాయిల్ మాదిరి లొట్టలు పడిపోయింది. ఎప్పుడూ హేపీగా వుండాలి. జాగ్రత్తగా వుంటుండాలి. చురుకుగా వుండాలి. ఏ పని చేయాలన్నా జాగ్రత్తగా ముందుకు నడవాలి. అప్పుడే తగిన భద్రత, శాంతి యేర్పడుతుంది. ఈనాడు దేశములో యిలాంటి పని చేసేవారు తక్కువ కావటం చేతనే మనము విదేశములపై ఆధారపడవలసి వస్తున్నది. ఒక్కతూరి మీరు వెనుకకు తిరిగి చూడండి. ఈ బ్రిటీషువారు భారతదేశమును ఏవిధంగా వశము చేసుకున్నారు? పాకీస్థాన్ భారతదేశములో చేరినప్పుడు జనాభా 48 కోట్లు, 50 సంవత్సరముల పూర్వము. బ్రిటీషువారు ఎంతమంది? ఒక కోటికూడా లేరు. ఇంత చిన్న బ్రిటీషు దేశము యింత పెద్దదైన భారతదేశమును ఎలా వశము చేసుకున్నారు? కేవలము తమకు తాము ద్రోహము చేసుకున్నారు. ధనము కోసము లొంగిపోయారు. స్వార్థస్వప్రయోజానలకోసం దేశమునందించారు. పనిచేయలేని సోమరులుగా తయారైపోయారు. కనుక, వారు సులభంగా ఆక్రమించుకున్నారు దేశాన్ని. 'ఏనుగెట్టుల తన బలమెరుగలేదో'. ఏనుగుకు తన బలము ఎంత వుందో తనకే తెలియదు. తొండముతో కొడితో 90 అడుగుల దూరము పడిపోతారు. అంత శక్తి వుండినా మావటి అంకుశము చూస్తేనే అణగి వుంటుంది. ఏమిటి కారణము? తన బలము తనకు తెలియదు. అట్లనే ప్రతి పిల్లవానియందు, ప్రతి వ్యక్తియందు గొప్ప శక్తి వుంటున్నది. ఎంత శక్తియో వుంటున్నది.  ఒక్క నిముషములో యేమైనా చేయవచ్చు. ఎంతటి విజయమునైనా సాధించవచ్చు. సంకల్పించుకుంటే జగత్తులో సాధించ లేనిది కానరాదు. సాధించవచ్చు. కానీ, ఆశక్తి తాను ఆవిర్భవింప చేసుకొనుటకు తగిన కృషి చేయటం లేదు. ఎగరటానికి ప్రయత్నం చేస్తే గరుడ ఎన్ని మైళ్ల దూరమైనా వెళ్లిపోతుంది. కానీ, ఎగరటానికి యిష్టము లేకపోతే ఒక్క అడుగైనా ముందుకు పోలేదు. చీమ

వున్నాది. నడవటానికి ప్రయత్నం చేస్తే ఎన్ని మైళ్ళైనా నడచిపోతుంది. చీమ శక్తిని త్యాగరాజు వర్ణించాడు.

చీమలో బ్రహ్మలో శివకేశవాదులలో
ప్రేమమీర వెలసియుండే బిరుదు వహించిన సీతారామ
నన్ను బ్రోవరా! రామా నన్ను బ్రోవరా!

శి, కేశవులు అనగా ఎవరు? మానవులే. జీవితముతో వున్నవాడే శివుడు. జీవితము లేనివాడే శవము. శివుడనగా మానవుడే. త్యాగరాజు మరొక పర్యాము చెప్పాడు. ఏమని? ప్రతి ఒక్కటీ భగవత్ శక్తియే. చదువుట, వ్రాయుట, మాట్లాడుట, నడచుట, అన్నీ భగవంతుని శక్తులే. ఒకానొసమయంలో త్యాగరాజుకు కొంచెం విసుగు పుట్టింది. అన్న రఘునాధుడు, త్యాగరాజు పూజించే విగ్రహాలను కావేరిలో వదలిపెట్టాడు. రామా! ఏమిటి నాకీ బాధలు కలిగించటం. నాలో భక్తి లేదా లేక నీలో శక్తి లేదా? నిజంగా నాలో భక్తి వుంటే రాములు నన్ను వదలి వెళ్లేవాడా? నీలో శక్తి వుంటే నన్ను ఈ బాధలు పెట్టేవాడా? నీలో శక్తి లేదు నాలో భక్తి వుందని అహంకారమునకు అవకాశమిచ్చాడు. నాలో భక్తి వుంది. నిన్ను తలవని క్షణము లేదు. నిన్ను ప్రార్థించని నిముషము లేదు. నిన్ను ఆరాధించని సమయము లేదు. నీలో శక్తి లేదన్నాడు. ఆదేది చేతకానప్పుడు డోలువానిపై అరిచాడుట. తరువాత ప్రార్థన చేశాడు. 'ఛీ! నాది ఎంత పొరపాటు? రాముడు మహీ శక్తిమంతుడు. అప్పుడు చెబుతున్నాడు.

కపి వారధి దాటునా? కలికి రోటగట్టునా?
లక్ష్మిదేవి వలచునా? లక్ష్మణుండు కొలచునా?
సూక్ష్మబుద్ధిగల భరతుడు చూచిచూచి మ్రొక్కునా?
అబ్బ రామశక్తి ఎంతొ గొప్పరా!

నీ శక్తి లేక ఒక కోతి యింత పెద్ద సముద్రాన్ని ఎట్లా దాటింది? రాంరాం అని నామస్మరణతోనే దాటింది. లక్ష్మీదేవి ఎవరు? ప్రపంచమంతా లక్ష్మిని ఆరాధిస్తారు. కోరనివాడు లేదు. అలాంటి లక్ష్మీదేవి నిన్ను కొలుస్తుందా స్వామీ! నీలో శక్తి లేకపోతే ఆమె ఎందుకు కొలుస్తుంది? ఎంత గొప్పది రామా, నీ శక్తి. నా పాత్ర చిన్నదిగా వుంటున్నది. నా పాత్ర ఎంతో అంతే అనుగ్రహము వచ్చింది నాకు. నా పాత్రను పెద్దది చేసుకోవాలి. ఈ పాత్ర పెద్దది చేసుకుంటే నీ అనుగ్రహము దండిగా దొరుకుతుంది. భగవంతుడు ప్రేమస్వరూపుడు. ఆ ప్రేమతత్త్వము నింపుకోవాలంటే హృదయమనే పాత్ర పెద్దదిగా చేసుకోవాలి. మన హృదయమును సంకుచితంగా పెట్టుకొని భగవంతునపై నిందలు వేస్తే ఎవరి తప్పు? ఈనాటి విద్యావిధానము యొక్క దోషమే దీనికి కారణము. ఈ విద్యావిదానము లోపల సరైన నైతిక, ధార్మిక, ఆధ్యాత్మికము శూన్యమైపోయింది. ప్రాచీన సాంప్రదాయము కలిగిన పండితుని కుమారుడున్నాడు. నిరంతరము తండ్రినుండి సంధ్యావందనము చేయటం, గాయత్రిని జపించటం ఈవిధమైన పవిత్ర మార్గములో జీవితము గడుపుతూ వచ్చాడు. కానీ, దుస్సంగములో చేరిపోయినాడు ఈ పిల్లవాడు. దుస్సంగము వల్ల, నా ఫ్రెండ్సు అమెరికా పోతున్నారు. నేనూ పోవాలి' అన్నాడు. 'నాయనా! మన సాంప్రదాయము, మన సిద్ధాంతము అక్కడ సరిగా వుండదు. అక్కడ గాయత్రి మంత్రము జపించుటకు అవకాసము వుండదు. సంధ్యావందనము చేసుకోటానికి అవకాశముండదు. నీవు చేసుకుంటే నిన్ను పిచ్చివాడని హేళన చేస్తారు. కనుక, నీవు పోవద్దు' అన్నాడు. కానీ, ఈ మొండి బిడ్డ చాలా పట్టుపట్టాడు. ఒకే కుమారుడు. ధనేషణ, దారేషణ, పుత్రేషణ ఈ ఈషణత్రయములు తల్లిని, తండ్రిని ఉరి వేస్తున్నాయి. కుమారుని బాధ తట్టుకోలేక ఒప్పుకున్నాడు. పాస్‌పోర్టు, వీసా అన్నీ తీసుకున్నాడు. రేపటి దినము వెళ్ళిపోవాలి. తల్లి పిల్లవానితో, 'నీవు ఎక్కడికిపోయినా మన కులదేవతను నీవు హృదయములో చింతించు. గాయత్రిని నీవు చింతిస్తూ వుండు. మంత్రము మరువకు' అని చెప్పింది. అమెరికా స్వర్గమనుకున్నాడు వాడు. అంత చెడ్డది మరొకటి లేదు. ఇండియా ఎంత పవిత్రమైనది. ఎంత పుణ్యవంతమైనది. పుణ్యభూమి, త్యాగభూమి, ధన్యభూమి, జన్మభూమి. అక్కడంతా కృత్రిమ జీవితము. వెళ్ళిపోతున్నాడు. తండ్రి మాట తీసుకున్నాడు. 'తెల్లవారి, సాయంకాలము సంధ్యావంనము చేయాలిఎలాంటి పరిస్థితిలోనూ మరువవద్దు'. సరే యిచ్చాడు. ఇండియా దాటిపోతే చాలనుకున్నాడు. మాటకు ప్రాణము సత్యము. సత్యమే లేదు. పోయి ఐదు సంవత్సరములైఎది. ఇండియన్ భాష మరచిపోయాడు. అమ్మతో ఫోనులో మాట్లాడితే తెలుగు రావటం లేదు. ఏదేదో మాట్లాడుతున్నాడు. తల్లికి తెలియదు పాపం. తండ్రికి యిచ్చింది. 'ఫాదర్! నేను యింకా ఐదు సంవత్సరములుండాలి. ఇంకా చదవాలి' అన్నాడు. ఏది చదవాలని పోయాడో అది పూర్తి కాలేదు. అమ్మనాన్నలు పంపే ధనముతో తింటూ కూర్చున్నాడు. పనిలేని మంగలి పిల్లి తల గొరిగాడుట. ఈవిధంగా కాలము గడిపాడు. తల్లికి చాలా సీరియస్ అయిందని టెలిగ్రామ్ యిచ్చాడు తండ్రి. 'danger come immediately'

అన్నాడు లేకపోతే రాడని. పోకపోతే తిరిగి డబ్బు పంపిస్తాడో లోదోనన్న భయముతో వచ్చాడు. వస్తున్నాడని తల్లిదండ్రులు చాలా ఆనందించారు. జాబులలో గాయత్రిని మరువలేదు, పూజ చేస్తున్నాని అబద్దాలు వ్రాస్తూ వచ్చాడు. విమానాశ్రయములో దింపుకొని కారెక్కి తిన్నగా కాళికాలయమునకు వెళ్ళాడు. ఎందుకంటే పంపించేటప్పుడు ఆమె ఆశీర్వాదముతో పంపించాడు. ఆమె ఆశీర్వాదముతో తిరిగి యింటికి పోవాలి అని తండ్రి ఆశ పాపం. 'నాయనా! నమస్కారం చేయి' అన్నాడు. "how are you madam?" అన్నాడు. తండ్రికి కోపం వచ్చి, 'నీ పిండం. ఇదేనా నీవు నేర్చుకు వచ్చింది. ఛీ! ఇలాంటివాడు నాకు కొడుకే కాదు. బయటకు పో' అన్నాడు. ఇది మానవత్వమా? ఎంతపొగరు? ఇది రాక్షస లక్షణం. అలాంటి వారు ఎంతచదువు చదివినా మానవులే కారు. ఇలాంటి పిల్లలుగా తయారౌతున్నరు ఈనాడు. మొట్టమొట నైతికము కావాలి. అది లేక ఏమాత్రమూ జీవితము కానేకాదు. ఈనాడు దేశము ఛిన్నాభిన్నమవటానికి కారణం నైతిక ప్రవర్తన లేదు. పాపభీతి, దైవప్రీతి, సంఘనీతి ఈమూడూ వున్నప్పుడే త్రిమూర్తి స్వరూపులుగా చయారౌతారు. ఎంత గొప్ప చదువరియైనా దైవవిశ్వాసము కోల్పోకూడదు. అది లేనివాడు శవముతో సమానమే. చనిపోయిన పులిచర్మము పనికి వస్తుంది. చనిపోయిన మృగమాంసము కొంటారు. గొడ్డు చర్మము చెప్పులు కుట్టటానికి పనికివస్తుంది. కానీ, మానవుని దేహము చచ్చిన తర్వాత దేనికీ పనికిరాదు. చర్మముకూడా పనికి రాదు. అలాంటి మానవత్వములో దివ్యమైన కీర్తిని సంపాయించుకోవాలి. ఆ ప్రేమయే సర్వమూ చేకూర్చుకుంటుంది.

ప్రేమముదిత మనసె కహో